భవనం పై పెచ్చులూడి..

దెబ్బతిన్న హీరో షోరూంలోని వాహనాలు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 10: శిథిలావస్థకు చేరిన భవనం పై పెచ్చులు ఊడిపడిన ఘటన శంషాబాద్‌లో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం... శంషాబాద్ పట్టణంలో హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గణేశ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరింది. కొన్ని రోజుల నుంచి భవనంపై నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో రెండుఅంతస్తుల పెచ్చులు ఊడి హీరో షోరూంలోని ద్విచక్ర వాహనాలపై పడ్డాయి. దీంతో పాటు చుట్టు పక్కల ఉన్న రెండు దుకాణాలు దెబ్బతిన్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బండ్లగూడ, ఫిబ్రవరి 10: అనుమతులు లేని నిర్మాణాలను రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు శనివారం కూల్చివేశారు. డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లిలో కొన్ని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వెల్లడించారు. అనుమతులు తీసుకున్న ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు నిబంధన ఎత్తివేయాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 10: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు లబ్ధి పొందాలంటే రేషన్ కార్డు ఉండాలనే నిబంధనను ఎత్తివేయాలని హిమాయత్‌నగర్ డివిజన్ కార్య నిర్వాహక అధ్యక్షుడు పాలడుగు శ్రీనాథ్ డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్ లోని వీధి నం.15లో గృహజ్యోతి పథకానికి సంబంధించి దరఖాస్తుల పరిశీలన కేంద్రాన్ని ఆయన సందర్శిం చి మాట్లాడారు. ప్రజా పాలనలో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తున్న వారు వివరాలను విద్యుత్ అధికారులకు అందజేయాలని కోరారు.

మురుగుతో పరేషాన్..

- మణికొండలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ
- రెండు నెలలుగా ఇదే వైనం
- స్పందించని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం
- బోరుమంటున్న ఇంటి యజమాని

మణికొండ పాతగ్రామంలోని గుబ్బాలమ్మ దేవాలయం వీధిలో ఓ ఇంట్లోకి వచ్చిన మురుగునీరు

మణికొండ, ఫిబ్రవరి 10 : పేరు గొప్ప.. ఊరుదిబ్బ అన్నచందంగా తయారైంది మణికొండ మున్సిపాలిటీ పరిస్థితి. ఎక్కడ చూసినా హడావిడి తప్పా అభివృద్ధి శూన్యమనే వాదనలు విన్పిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలను ఏ స్థాయిలో గాలి కొదిలేస్తున్నారో అర్థమవుతున్నది. మణికొండ పాత గ్రామం గుబ్బాలమ్మ దేవాలయం వీధిలో రెండు నెలలుగా ఓ ఇంట్లోకి మురుగు నీరు వచ్చి చేరుతోంది. దుర్వాసనతో స్థానిక ప్రజలు ఇళ్లు కాళీచేసి వెళ్లిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో దిక్కుతోచక ఇంటి యజమాని ఈదులకంటి మహేశ్‌కుమార్ మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. తన ఇంట్లోకి వెళ్లలేక మరో ఇంటిలో కాలాన్ని గడుపుతున్నాడు. ఇంటి యజమాని మహేశ్.. తమ ఇంటి పన్నులన్నీ చెల్లించామని, అయినా ఇంట్లోకి ఏవిధంగా మురుగునీరు వస్తుందని అడిగినా సదరు అధికారులు స్పందించకపోవడం గమనార్హం. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం గుర్తించకపోవడంతో ఇంట్లోని అన్ని గదుల్లో ఎగువ ప్రాంతం నుంచి మురుగునీరు వచ్చి నిండిపోయింది. దుర్వాసనతో ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారు. విషయం తెలిసినా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో సమస్యను పరిష్కరించాలని బాధితుడు కోరుతున్నాడు.

పెరుగుతున్న సౌరశక్తి వినియోగం : టీఎస్ రెడ్కో ఎండీ

హైదరాబాద్, ఫిబ్రవరి 10: సోలార్ విద్యుత్ వల్ల గృహ వినియోగదారులకు ఎన్నో లాభాలున్నాయని టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య పేర్కొన్నారు. గ్రీన్‌టెక్ ఇండియా, అదానీ సోలార్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ లోని హోటల్ హయత్‌లో పార్ట్‌నర్స్ మీట్ 2024 నిర్వహించింది. ఈ మేరకు శనివారం ఎన్. జానయ్య, అదానీ సోలార్ సేల్స్ నేషనల్ హెడ్ సెసిల్ అగస్టిన్‌తో కలిసి, గ్రీన్‌టెక్ ఇండియా వ్యవస్థాపకుడు సత్య కిరణ్ గన్నారపు ఈ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర మార్కెట్‌లోకి అదానీ సోలార్ ద్వారా అధిక సామర్థ్యం గల సోలార్ ప్యానెల్ టాప్‌కాన్‌ను విడుదల చేశారు. అనంతరం టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య మాట్లాడుతూ.. ఒక్కో కిలోవాట్‌పై రూ.18వేల సబ్సిడీ ఇస్తూ... రెండు నుంచి మూడు కిలోవాట్లను గృహ వినియోగదారులు ఏర్పాటు చేసుకునేలా అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. దీనివల్ల ఒక్కో యూనిట్‌పై 36వేల నుంచి 40వేల దాకా సబ్సిడీ పొందే అవకాశం ఉందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయని పేర్కొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టండి

సింక్రోఫార్మా సదస్సులో పాల్గొన్న డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా డా.ఏ.రాంకిషన్ తదితరులు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 10:పార్మసీ రంగంలో సరికొత్త ఆవిష్కరణలు, టెక్నాలజీలపై పట్టు సాధిస్తే అద్భుతమైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా(హైదరాబాద్ జోన్) డా.ఏ.రాంకిషన్ అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మసీ కళాశాలలో 'సింక్రోఫార్మా–2024' పేరుతో రెండురోజుల సదస్సుకు డా.రాంకిషన్ హాజరై శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశం వైద్యరంగానికి హబ్‌గా మారిందని తెలిపారు. ఫార్మసిస్టులు కూడా పరిశ్రమకు అవసరమైన నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. సదస్సులో 800మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ అరిజీన్ ఫార్మాస్యూటికల్స్ సంస్థ సీఈవో అఖిల్ రవి, సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలీవుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, అబ్దుల్ ఖదీర్, అక్బర్ అలీ ఖాన్, అమీర్‌జావెద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.అనుపమ కోనేరు పాల్గొన్నారు.

పోస్ట్‌మ్యాన్ లెటర్ ఇవ్వలేదని రాయితో దాడి

బండ్లగూడ, ఫిబ్రవరి 10 : పోస్ట్‌మ్యాన్ లెటర్ ఇవ్వలేదని ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు కథనం ప్రకారం... కాళీ మందిర్ ప్రాంతంలోని పోస్టాఫీస్‌కు ఓ సొసైటీ పేరుమీద లెటర్ వచ్చింది. దానిని వారికి ఇచ్చేందుకు పోస్టుమ్యాన్ శ్రీకాంత్ వెళ్లాడు. సదరు చిరునామాలో ఎవరూ లేకపోవడంతో అతడు తిరిగి పోస్టాఫీసుకు వెళ్లాడు. అనంతరం మల్లికార్జున్ అనే వ్యక్తి పోస్టాఫీస్ వద్దకు వెళ్లి ఆ లెటర్ మా అంకుల్ పేరుమీద వచ్చిందని తనకు ఇవ్వాలని కోరాడు. అలా ఇవ్వడం కుదరని, సోమవారం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని పోస్టుమ్యాన్ శ్రీకాంత్ బదులిచ్చాడు. దీంతో కోపోద్రిక్తుడైన మల్లికార్జున్ అక్కడే ఉన్న ఓ రాయి తీసుకొని శ్రీకాంత్‌పై దాడి చేయడంతో గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 10 : కేంద్రంలోని బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని, ప్రజల హక్కులను కాలరాస్తోందని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ ఆరోపించారు. ప్రజాస్వామ్య రక్షణ సమితి ఆవిర్భావ సమావేశం శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ హాజరై మాట్లాడారు. అనంతరం కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జస్టిస్ చంద్రకుమార్, ఉపాధ్యక్షుడిగా ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మజీద్ షోయబ్, కార్యదర్శిగా డాక్టర్ గోపీనాథ్‌ను ఎన్నికయ్యారు.సమావేశంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రధాన కార్యదర్శి కామేశ్వర్ రావు , ఓట్ నీడ్ గ్యారంటీ అధ్యక్షురాలు సొగరాబేగం, ప్రొఫెసర్ అన్వర్ కుమార్, భాస్కర్, దీపక్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 10 : రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలోని వెంకటగిరి ప్రభుత్వ పాఠశాలలో 230 మంది విద్యార్థులకు పాదరక్షలు (షూస్) పంపిణీ చేశారు. పేద విద్యార్థుల అవసరాలను గుర్తించి షూస్‌ను అందజేశామని సెక్రటరీ నీరజా రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రముఖులు బుసిరెడ్డి శంకర్‌రెడ్డి, ఏజి నాగచైతన్య, డీజీఈ డాక్టర్ రాంప్రసాద్, అధ్యక్షుడు దుర్గాప్రసాద్, డాక్టర్ అనితా దేవులపల్లి, ప్రముఖులు పాల్గొన్నారు.

దారిదోపిడీకి పాల్పడుతున్న ముఠా అరెస్టు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 10 : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తులను అడ్డగించి దారి దోపిడీ చేసిన ఆరుగురు దుండగులను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ మోహన్ కుమార్, సీఐ బండారి శోభన్, డీఐ క్రాంతికుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మలక్‌పేటకు చెందిన మహ్మద్ జుబేర్, బోయినపల్లికి చెందిన సయ్యద్ అఫ్రోజ్, సయ్యద్ ఆదిల్, మహ్మద్ సమీర్, అబ్దుల్ నదీమ్, షేక్ నవాజ్ ముఠాగా ఏర్పడ్డారు. డబ్బులు సంపాదించేందుకు దారి దోపిడీని ఎంచుకున్నారు. ఈ నెల 4న ఓ అద్దె కారు తీసుకొని మద్యం షాపుల్లో పూటుగా తాగారు. అనుకున్న పథకం ప్రకారం... దారిలో వెళ్తున్న వారిని అటకాయించి దోపిడీ చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన నేపాల్‌కు చెందిన రాజ్గీర్ కుమార్, దిలీప్, బచ్చన్ కుమార్ అమీర్‌పేట ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా.. కారుతో అటకాయించి బెదిరించి వారి వద్ద నుంచి రూ.10వేల నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి శనివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెడుతామని ఏసీపీ తెలిపారు.

గృహజ్యోతి లబ్ధిదారుల వివరాల నమోదు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీల్లో భాగమైన గృహజ్యోతి పథకానికి అర్హులైన తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల నమోదు ప్రక్రియను విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌సి చంద్రశేఖర్, డీఈ నరేందర్ రెడ్డి, ఏఈ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరం



హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 10: పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడ బిడ్డల పెండ్లి.. తల్లిదండ్రులకు భారం కావద్దనే ఉద్దేశంతో అప్పటి సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేశారని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు శనివారం నారాయణగూడలోని క్యాంపు కార్యాలయంలో సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన భార్గవి, మంచాల శ్రీలతకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ పథకాన్ని ఆడబిడ్డలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జి.రామన్‌గౌడ్, మహేశ్, జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

దోమలు విజృంభించకుండా కార్యాచరణ



బస్తీ దవాఖానలో మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న వీబీడీ కంట్రోల్ క్యాంప్ సిబ్బంది

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 10: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పిచికారి పనులు ముమ్మరంగా చేపట్టేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిన్మయి శ్రీరంగతో నేషనల్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ క్యాంపు సిబ్బంది సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ ఆర్డీఓ బదిలీ

బండ్లగూడ, ఫిబ్రవరి10 : రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్య బదిలీ అయ్యారు. గోదావరిఖని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ప్రభుత్వం ఆయనను నియమించింది. ఈ మేరకు శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొంతకాలంగా మల్లయ్య రాజేంద్రనగర్ ఆర్డీవోగా పనిచేస్తూ శేరిలింగంపల్లి తాసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. సింగరేణి కాలరీ కోల్ కంపెనీ లిమిటెడ్‌కు ఆయన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు.

ఉద్యోగి ఆత్మహత్య

ఖైరతాబాద్, ఫిబ్రవరి 10 : టీఎస్ ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖైరతాబాద్ ఏఎస్‌ఐ శ్రీరాములు కథనం ప్రకారం... చింతలబస్తీలోని వీరనగర్‌లో నివాసం ఉంటూ.. రావూరి సునీల్ ప్రభాకర్ (40) ట్రాన్స్‌కోలో ఆర్టిజన్ గ్రేడ్–4 ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ నెల 7న ఫోన్, బైక్ తాళాలను ఇంటి వద్ద ఉంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. రాత్రి 10.30గంటల సమయంలో ఖైరతాబాద్ ఐసీఐసీఐ బ్యాంకు బస్టాప్ వద్ద దారిలో వెళ్లే ఓ వ్యక్తి దగ్గర ఫోన్ తీసుకొని ఆయన సోదరుడు దినకర్‌కు ఫోన్ చేశాడు. వెంటనే బంధువులకు సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకున్నారు. తాను విషం తాగానని, దవాఖానకు తీసుకెళ్లాలని కోరాడు. వెంటనే మహవీర్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పులు తీవ్ర మానసిక క్షోభకు గురిచేశాయని, అందుకే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని ఆయన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు శిక్షణ, ఉద్యోగం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 10 : నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఐటీ బిజినెస్ అనాలసిస్ట్ రాజేశ్ కుమార్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఈ, బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ, ఎంటెక్, పీజీ చేసిన వారు తమను సంప్రదించాలని, తదితర శిక్షణ తరగతులు నిర్వహించి నిష్ణాతులుగా తీర్చిదిద్దుతామని, శిక్షణ అనంతరం వారికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 80745 54466 నంబరులో సంప్రదించాలని కోరారు.

గవర్నర్ రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 10 : గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్ని పార్టీలు, ప్రజల పట్ల రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాడు గవర్నర్ కోటాలో బీసీ సామాజికవర్గానికి చెందిన దాసోజు శ్రవణ్, ఎరుకల సామాజికవర్గానికి చెందిన బూర సత్యనారాయణకు ఎమ్మెల్సీ ఇవ్వాలని ప్రతిపాదించగా రాజకీయ నేపథ్యం ఉందంటూ తిరస్కరించారని గుర్తు చేశారు. నేడు ఓ రాజకీయ పార్టీ నాయకుడు, ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఎలా ఆమోదం తెలిపారని ప్రశ్నించారు. ఈసమావేశంలో కో కన్వీనర్ ఇర్మియా, పీటర్, అఖిల భారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

NOTICE

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT : CHEVELLA

O.S. No. 407 of 2022

Between:
Sri. Nukala Srinivas Rao and 3 others ...Plaintiffs
AND
M/s. Shreya Homes and 2 others ...Defendants

To,
1. M/s. Shreya Homes, Office at Plot No. 19, 2nd floor, Opp. Indo-American Cancer Hospital, New Block Gate, Lane to Kushalya Global School, Road No. 10, Banjara Hills, Hyderabad-Rep.By Sri G. Sridhar Goud.
2. C. Kiran Kumar, S/o C. Vasudeva Reddy, Aged about 42 years, Occ: Business, R/o. Plot No. 19, 2nd floor, Opp. Indo-American Cancer Hospital, New Block Gate, Lane to Kushalya Global School, Road No. 10, Banjara Hills, Hyderabad.
   Also at: 5-51234/5,Ganesh Nagar, Vanastalipuram, Hyderabad-500070.
   Also at: ANZ Agencies, 6/3/456/a/2, Flat No. 304, Models House, Panjagutta, Hyderabad.
3. C. Sadanand, S/o Ananthaiah, Aged about 39 Years, R/o. Allamathot Bhai, Begumpet, Hyderabad-500016. ...Defendants

Please take notice that the above said O.S. has been filed by the Plaintiff seeking relief for specific performance. The Hon' ble Court has posted the above said matter on 13-02-2024 for your appearance, if any. Please appear at 10:30 A.M. before the above mentioned court on 13-02-2024 with any objections failing which the above said matter will be decided in your absence and on merits.

(By Order of Hon' ble Court)

Sd/- Ashish Samat, Advocate
2nd Floor, Manianjaiah Mansion, Above Pharma Plus, Beside Sindhi Co-operative Bank, PG.Road, Secbad-03.
Ph +919885085951

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 10: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ.. కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతున్నదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. దీనిని నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మెను ఈ నెల 16న నిర్వహిస్తున్నామని తెలిపారు. శనివారం కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలోని స్వప్న థియేటర్ చౌరస్తా వద్ద పలు పరిశ్రమల్లో పని చేసే కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర సామాజిక సమస్యలు పరిష్కరించాలని నిరసనలు, ధర్నాలు చేస్తున్న సందర్భాల్లో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా అణిచివేతకు గురి చేస్తున్నదన్నారు. ఈ నెల 16న కాటేదాన్ సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కార్మికులు, పరిశ్రమల యజమానులు బంద్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, క్లస్టర్ కన్వీనర్ రుద్రకుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు స్వామి, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి మరిన్ని నిధులు కేటాయించాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి10: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన 7.75 శాతం నిధులు ఏ మాత్రం సరిపోవని మరిన్ని నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు ఇవ్వాల్సి ఉండగా కేవలం 7.75 శాతం మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.1000 కోట్ల నిధులు ఇవ్వడంతో పాటు ఉన్నత విద్యప్రమాణాల పెంపునకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆక్రమణకు గురైన భూముల పరిశీలన

నెక్నాంపూర్‌లో ఆక్రమణకు గురైన భూములను పరిశీలిస్తున్న గ్రామస్తులు

మణికొండ,ఫిబ్రవరి 10 : గండిపేట రెవెన్యూ మండలం నెక్నాంపూర్ గ్రామంలో సర్వే నంబర్ 31లో జరుగుతున్న భూ ఆక్రమణలను శనివారం గ్రామస్తులతో కలిసి మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు కుంభళ్ల ధన్‌రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారం చేపట్టగానే ఆక్రమణలు జోరందుకున్నాయని ఆరోపించారు. నెక్నాంపూర్ గ్రామంలోని అర్హులైన నిరుపేదల కోసం కేటాయించిన భూములను ఆక్రమించేందుకు కొంతమంది వ్యక్తులు రాత్రింభవళ్లు తిరుగుతున్నారని తెలిపారు. సర్కారు భూమిని కబ్జా చేస్తున్నారని రెవెన్యూ అధికారులకు విన్నవించినా స్పందించలేదన్నారు. వక్ఫ్‌బోర్డు భూమిగా పేర్కొంటూ నిర్మాణాలు చేపడుతున్న భూమిలో గతంలో బీఆర్ఎస్ సర్కారు హరితహారంలో భాగంగా వేలాది మొక్కలను నాటిందని ధన్‌రాజ్ పేర్కొన్నారు. మొక్కలు, రాళ్లను జేసీబీ సహాయంతో పక్కనే ఉన్న పెద్ద చెరువులోకి తోసేసి కబ్జాలు చేస్తున్నారని, కబ్జారాయుళ్ల వెనుక ఎవరున్నారో అధికారులు తేల్చాలని డిమాండ్ చేశారు. విలువైన సర్కారు భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

'కొత్త కథ' పుస్తకావిష్కరణ

రచయిత మహ్మద్ ఖదీర్ బాబు సంపాదకత్వంలో పలువురు రచించిన సంకలనాలతో వెలువడిన 'కొత్త కథ' పుస్తకాన్ని శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు బి.నర్సింగ రావు, ప్రముఖ రచయితలు ఆడెపు లక్ష్మీపతి, దాదా హయత్, కాట్రగడ్డ దయానంద్ తదితరులు – *ఖైరతాబాద్, ఫిబ్రవరి 10*

అవిశ్వాసం నెగ్గి తీరుతాం

స్పష్టం చేసిన మణికొండ కౌన్సిలర్లు

మణికొండ, ఫిబ్రవరి 10: మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ పై పార్టీలకతీతంగా కౌన్సిలర్లు అందరూ ఒకతాటిపైకి వచ్చి అవిశ్వాసం తప్పక నెగ్గించుకుంటామని వివిధ వార్డుల కౌన్సిలర్లు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ... మెజార్టీ సభ్యుల విశ్వాసం కోల్పోయిన చైర్మన్ స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేయాలని సూచించారు. మణికొండ మున్సిపాలిటీలో ఈ నెల 22న జరగనున్న అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నవీన్‌కుమార్, వసంత్‌చౌహాన్, రామకృష్ణారెడ్డి, కావ్య, 0శైలజ, శ్వేతారెడ్డి, పద్మారావు పాల్గొన్నారు.

మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 10 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ.. మాదిగ సామాజికవర్గాలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జీడీ నర్సింహ మాదిగ, సుదర్శన్ మాదిగ, కృష్ణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వంగడాల రూపకల్పన అవసరం

టీఎస్‌కాస్ట్ కన్సల్టెంట్ డా.అహ్మద్ కమల్

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 10: భవిష్యత్ తరాలకు నూతన వంగడాల రూపకల్పన ఎంతో అవసరమని టీఎస్‌కాస్ట్ కన్సల్టెంట్ డా.అహ్మద్ కమల్ పేర్కొన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ నిర్వహించిన జీవ సాంకేతిక పరిజ్ఞానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటికే సాగులో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం అధికమైందని, పౌష్టికాహారం అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రిజిస్ట్రార్ డా.వెంకటరమణ, రీసెర్చ్ డైరెక్టర్ డా.రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. యువ శాస్త్రవేత్తలు బయోటెక్నాలజీని ఉపయోగించుకుని కొత్త వంగడాలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఐబీటీ డైరెక్టర్ డా.సి. సమీర్‌కుమార్, టీఎస్ కాస్టు ప్రతినిధి శాంతాకుమారి, సీహెచ్ అనురాధ, వ్యవసాయ ఉద్యాన వన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి.. కిందపడి గాయాలు

లైసెన్స్ లేకపోవడంతో కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 10: లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ బైక్‌పై నుంచి కిందపడి గాయాలపాలైన యువకుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కార్వాన్‌కు చెందిన అబ్దుల్ సలీమ్ (18) అనే యువకుడు శుక్రవారం రాత్రి 11.30 సమయంలో తన స్నేహితుడు ఆకాశ్‌ను బైక్‌పై ఎక్కించుకుని బంజారాహిల్స్ రోడ్ నం.12 మీదుగా కమాండ్ కంట్రోల్ వైపు వెళ్తున్నాడు. ఐసీఐసీఐ బ్యాంక్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో సలీమ్‌కు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అతడిని టీఎక్స్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ మేరకు సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టగా బైక్ నడిపిస్తున్న సలీమ్‌కు లైసెన్స్ లేదని తెలిసింది. దీంతో గాయాలైన సలీమ్ పై చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ కానిస్టేబుల్ శేఖర్‌బాబు ఇచ్చిన ఫిర్యాదుతో ఐపీసీ 279, 336తో పాటు 180, 181, 184 ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.